క్లుప్తంగా

ముచ్చట్ల మల్లికార్జునుడికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపంలో వెలసిన ముచ్చట్ల భ్రమరాంబా, మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ముచ్చట్ల భ్రమరాంబా, మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళ హారతి తదితర పూజలు చేశారు.

నవోదయకు విద్యార్థి ఎంపిక



సూర్య సందీప్

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన సూర్య సందీప్ నవోదయ పాఠశాలకు ఎంపిక య్యాడు. పేద కుటుంబానికి చెందిన సూర్య సందీప్ 6వ తరగతి ప్రవేశ పరీక్షలో అధికమార్కులు సాధించి పాఠశాలకు ఎంపికవడంతో గ్రామస్తులు, విద్యార్థి తల్లిదండ్రులు అభినందించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఉపసర్పంచ్

కోవెలకుంట్ల: స్థానిక నాగుల కట్ట వద్ద మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, టౌన్‌బ్యాంకు చైర్మన్ సముద్రాల శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యక్షుడు జీవీ సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు రామచంద్రరాజు, కోశాధికారి మురళీమోహన్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

డోన్: స్థానిక శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ, రాము శర్మ స్వామి వారికి చక్రస్నానం చేయించి, పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి పూజలు నిర్వహించారు. పూజల్లో ఆలయ ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, రజనీకుమారి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాగునీటిని పొదుపుగా వాడుకోవాలి



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ జయరాం

డోన్: తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం పట్టణవాసులకు సూచించారు. సోమవారం ఆయన 15వ వార్డులో మున్సిపల్ డీఈ రసూల్, ఏఈ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషాలతో కలిసి పర్యటించారు. తాగునీటి సమస్యపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే గాజులదిన్నె నీటితో పాటు గోరుకల్లు రిజర్వాయర్ నుంచి శుద్ధజలాన్ని ప్రతి ఇంటికి సరఫరా చేస్తామని, అంతవరకు పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

కోవెలకుంట్ల: సార్వత్రిక ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వరప్రసాద్ హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆయా పార్టీల అభ్యర్థులు ఎన్నికల కోడ్‌కు అనుగుణంగా ప్రచారం నిర్వహించుకోవాలన్నారు. బహిరంగ సభలు, ర్యాలీలు, తదితర ప్రచార కార్యకలాపాలకు ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. కోడ్‌కు విరుద్ధంగా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

డోన్ టౌన్: ప్రభుత్వ భూములు కాపాడాలని సీపీఎం మండల, పట్టణ కార్యదర్శులు కోయిలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్, సీఐటీయూ జిల్లా సభ్యులు ఎస్ఏ చిన్న రహిమాన్ తదితరులు సోమవారం ఆర్డీఓ మహేశ్వరరెడ్డికి వినతి పత్రం అందజేశారు. పట్టణ సమీపంలోని గుత్తి రోడ్డులో సర్వేనంబర్ 503లో ఉన్న ప్రభుత్వ భూమిని రియల్‌ఎస్టేట్ వ్యాపారులు రెవెన్యూ సిబ్బందితో కుమ్మక్కై తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించారని, విచారించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

చంద్రబాబుది దుర్మార్గపు ఆలోచన

- వలంటీర్ల సేవలు నిలిపేసిన విషయమై పింఛన్‌దారుల ఆగ్రహం
- ఓటు ద్వారా గుణపాఠం చెబుతామంటూ హెచ్చరిక



అచేతనావస్థలో ఉన్న వృద్ధురాలి ఐరిస్ తీస్తున్న వలంటీర్(ఫైల్)

సొంత కొడుకులే పట్టించుకోని పరిస్థితుల్లో జగన్ వృద్ధులకు పెద్ద కొడుకయ్యాడు. వికలాంగులకు, ఒంటరి మహిళలకు తోబుట్టువులా మారాడు. పింఛన్ పెంచి, వలంటీర్లతో సొమ్మును ఇంటికి పంపిస్తున్నాడు. నెలనెలా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఒకటో తారీఖున పొద్దున్నే వలంటీర్ డబ్బులు చేతిలో పెడుతుండటంతో అవ్వతాతలు మురిసిపోయేవారు. ఇదంతా 'పచ్చ బ్యాచ్' ఓర్చుకోలేకపోయారు. మంచి చేస్తే తమ ఉనికికే ప్రమాదమని చేయనివ్వకుండా అడుగడుగునా అడ్డుతగులుతున్నారు. ఇప్పుడు ఏకంగా కోర్టుకు వెళ్లి వలంటీర్ల సేవలను నిలిపేశారు. ఇది తెలిసిన అవ్వాతాతలు శాపనార్థాలు పెడుతున్నారు. వికలాంగులు, ఒంటరి మహిళలు తిట్ల దండకం అందుకున్నారు. చంద్రబాబు మదిలో ఇంత దుర్మార్గపు ఆలోచనలున్నాయా అంటూ అవాక్కవుతున్నారు. ఓటుతో తగిన బుద్ధి చెబుతామంటూ ముక్తకంఠంతో చెబుతున్నారు.

– బనగానపల్లె/డోన్



ఏఎన్ఎంతో కలిసి వైద్యసేవలందిస్తున్న వలంటీర్ (ఫైల్)

నోటి కాడి కూడు తీసేయడం తప్పు



పింఛన్ కోసం గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి నెలా 1వ తేదీనే తెల్లారకముందే వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తున్నాడు. మంచి పని ఎవరు చేసినా మంచే అనాలి. అలాంటిది వలంటీర్లను పింఛన్ పంచకుండా అడ్డుకుని మా నోటి కాడ కూడా తీసేయడం తప్పు.

– మీరావలి, వృద్ధుడు, కొండపేట, డోన్



నంద్యాల శాంతిరామ్ వైద్యశాలలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ హుస్సేన్‌బీ(ఫైల్)

బుద్ధి చెబుతాం



వలంటీర్లు పింఛన్ పంపిణీతో పాటు ప్రభుత్వ పథకాల సమాచారం కూడా ఇంటి వద్దకే వచ్చి చెబుతున్నారు. కేవలం రూ.5 వేల గౌరవ వేతనంతో పనిచేస్తున్న వారి పొట్ట కొట్టడం తప్పు. అలాగే మాకు పింఛన్ అందకుండా చేయడం పద్ధతి కాదు. వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబుతాం.

– గురుపాదమ్మ, డోన్ పట్టణం

మా ఉసురు తగులుతుంది



పింఛన్లు పంచకుండా టీడీపీ నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి అడ్డుకోవడం దుర్మార్గం. గతంలో పింఛన్ తీసుకునేందుకు ఎంతో ఇబ్బంది పడేవాళ్లం. ఇప్పుడు ప్రతి నెలా 1వ తారీఖున ఠంచన్‌గా పింఛన్ అందుతుంది. పింఛన్ అందకుండా చేసిన టీడీపీ నాయకులకు మాలాంటి వికలాంగుల ఉసురు తప్పక తగులుతుంది.

– హనుమన్న, దివ్యాంగుడు, ప్యాపిలి


పొద్దుపొడవక ముందే తీసుకుంటున్నాం



సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పొద్దుపొడవకు ముందే వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి పింఛన్ అందజేసి వెళ్తున్నాడు. అంతమంచి సేవలను రద్దు చేయడం తగదు. గతంలో ప్రతి నెలా తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద రోజుల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది.

– జమల్‌వలి, ఖాజీవాడ, బనగానపల్లె, పింఛన్‌దారుడు

వలంటీర్ల సేవలు అవసరం



వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ చాలా బాగుంది. ఎటువంటి ఇబ్బందులు లేకుండా పింఛన్‌దారులు ప్రతినెలా 1న తేదీనే పింఛన్ల పొందుతున్నారు. వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని నిలిపిస్తే తీవ్ర ఇబ్బందిగా ఉంటుంది. వారి సేవలు అవసరం.

– నరసింహులు, పెండేకంటి నగర్, వికలాంగుల పింఛన్‌లబ్ధిదారులు

వైఎస్సార్‌సీపీకి సంపూర్ణ మద్దతు

- నూర్‌బాషా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎస్ బాజీ



నియామక పత్రాలు అందజేస్తున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎస్ బాజీ

కోవెలకుంట్ల: వైఎస్సార్‌సీపీకి తమ సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తుందని నూర్‌బాషా(దూదేకుల ముస్లింమైనార్టీ) సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సయ్యద్ బాజీ అన్నారు. సోమవారం సాయంత్రం కోవెలకుంట్లలో సంఘం కమిటీలను నియామించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూదేకుల కులాన్ని కించపరిచేలా మాట్లాడితే అట్రాసిటీ కేసు నమోదు చేసి శిక్షించేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీఓ విడుదల చేసిందన్నారు. దూదేకుల అభ్యున్నతికి కృషి చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో మద్దతు ఇస్తున్నామన్నారు. అన్ని చోట్ల వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. రంజాన్ తర్వాత బనగానపల్లెలో నియోజకవర్గ స్థాయి సమావేశం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో సంఘం యువజన జిల్లా అధ్యక్షుడు డీసీ ఉసేన్, జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి, నియోజకవర్గ, మండలస్థాయి నాయకులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కాటసాని సమీక్ష

కోవెలకుంట్ల: స్థానిక మహాలక్ష్మి ఫంక్షన్ హాలులో మంగళవారం కోవెలకుంట్ల పట్టణ బూత్ కమిటీలతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమీక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బీవీ నాగార్జునరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని చేపట్టబోయే ఇంటింటి ఎన్నికల ప్రచారం, తదితర అంశాలపై ఎమ్మెల్యే చర్చిస్తారన్నారు. వైఎస్సాసీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, బూత్ కమిటీ సభ్యులు, గృహసారథులు హాజరు కావాలన్నారు.

భక్తిశ్రద్ధలతో పల్లకీసేవ



బనగానపల్లె రూరల్: యాగంటి ఉమామహేశ్వరస్వామికి సోమవారం పల్లకీసేవాను ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తోట బుచ్చిరెడ్డిల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో కొలువైన శివపార్వతులకు అభిషేకం అర్చన తదితర పూజలు నిర్వహించి సాయంత్రం ఉమామ హేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

వైఎస్సార్‌సీపీలో చేరిక

బనగానపల్లె: సంజామల మండలం ముదిగేడు గ్రామానికి చెందిన 15 టీడీపీ రజక కుటుంబాలు సోమవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎమ్మెల్యే వారికి తన స్వగృహంలో పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పుల్లన్న, మద్దిలేటి, బాలపుల్లన్న, నాగేంద్ర, బాలుడు, శేఖర్ గురుమూర్తి, కంబగిరి, సురేష్, రాముడుతో పాటు మరికొందరు టీడీపీ వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, ముక్కమల్ల మాజీ సర్పంచ్ పోచా వెంకట్రామిరెడ్డి, నాయకుడు ఎం.వెంటకేశ్వర్లు పాల్గొన్నారు.

తండ్రి గెలుపు కోసం తనయుడి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న కాటసాని ఓబుళరెడ్డి

కొలిమిగుండ్ల: తన తండ్రి కాటసాని రామిరెడ్డిని మరోసారి గెలిపించాలని కోరుతూ ఆయన తనయుడు ఓబుళరెడ్డి సోమవారం కోటపాడులో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓటేసి తన తండ్రి రామిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతయాని ఆయన వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి,గ్రామ నాయకులు మూల ఈశ్వరరెడ్డి, రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

అవుకు: మండల పరిధిలోని ఇస్రానాయక్ తండాలో మంగళవారం నుంచి వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం మహా గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధన, దీక్షారాధన, అంకురార్పణ, కలశస్థాపన, మహానివేదన, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 3వ తేదీ ఉదయం గణపతిపూజ, మండప ఆరాధన పూజలు, సర్వదేవత హోమాలు, పంచసూక్త హోమాలు, మహానివేదన, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం స్వామివారికి అభిషేకా, ప్రతిష్ఠ విగ్రహ గ్రామోత్సవం, ధాన్యాధివాసము, పుష్పధివాసము, శయ్యాధివాసము, ఫలాదివాసము, పవలింపుసేవ, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 4న గణపతిపూజ, పుణ్యాహవాచనము, వాస్తు పూజ, వాస్తు పర్విగ్నకరణం, ప్రాణ ప్రతిష్ఠ హోమం స్వామివారి దర్శన భాగ్యమనంతరం అన్నదానం ఉంటుందన్నారు.

మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి



బావిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి తనయుడు అర్జున్‌రెడ్డి

ప్యాపిలి: తన తండ్రి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని మరోసారి గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తారని ఆయన తనయుడు అర్జున్ రెడ్డి అన్నారు. జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, ఏపీ ఐబీసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి అర్జున్ రెడ్డి సోమవారం మండల పరిధిలోని బావిపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పథకాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఆయన వెంట ప్యాపిలి ఉప సర్పంచ్ గడ్డం భువనేశ్వర్ రెడ్డి, నాయకులు రాజా మురళీకృష్ణ, పర్వతం శ్రీనివాసరెడ్డి, బోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జాకీర్ తదితరులు ఉన్నారు.

డోన్‌లో..

డోన్: స్థానిక 30వ వార్డులో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్‌తో కలిసి అర్జున్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను వివరించి మరోసారి తన తండ్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో కౌన్సిలర్లు ఆర్టీ రమణ, రైల్వే నాగేంద్ర, మహేశ్వరి, వెంకట్రాముడు, సుంకన్న, కోఆప్షన్ సభ్యులు కుమ్మరి రాజు, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు పోస్టు ప్రసాద్, నాయకులు ధారా ప్రతాప్‌రెడ్డి, భాస్కర్, షేక్షావలి, పెద్దయ్య, మేకల రాజు, వలి, మల్లికార్జున పాల్గొన్నారు.

- 29వ వార్డులో కౌన్సిలర్ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎర్రమల, ప్రతాప్‌రెడ్డి, వడ్డె రంగస్వామి, బుర్రు శ్రీధర్, పెయింటర్ వెంకటేష్, రాజు, సురేష్, నాగిరెడ్డి తదితరులు ప్రచార నిర్వహించారు. ఎమ్మెల్యేగా బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని, ఎంపీగా పోచా బ్రహ్మానంద రెడ్డిని గెలిపించాలని వారు ప్రజలను కోరారు.



29వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న కౌన్సిలర్లు

ఇఫ్తార్ విందులో అర్జున్‌రెడ్డి

బేతంచెర్ల: స్థానిక హనుమాన్ నగర్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్ రెడ్డి ముస్లింలకు ఇచ్చిన ఇఫ్తార్ విందులో అర్జున్ రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ డైరెక్టర్ ముర్తుజావలీ, వైఎస్సార్‌సీపీ నాయకులు సురేంద్రనాథ్ రెడ్డి, చందురెడ్డి, కృష్ణమూర్తి, వలీబాషా, మల్లీ, అజ్మతుల్లా పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నాటుసారా బట్టీ ధ్వంసం

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె తండా గ్రామంలో నాటుసారా తయారు చేస్తున్నారనే సమాచారంతో పోలీసులు సోదాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన దశావత్ శ్రీనివాసులు నాయక్ నిర్వహిస్తున్న నాటుసారా బట్టీని ధ్వంసం చేసి 150 లీటర్ల బెల్లం ఊటను పారబోశారు. 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ మాసుం తెలిపారు.

ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీ

సంజామల: మండల పరిధిలోని నొస్సం ప్రభుత్వ దుకాణంలో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని ఎస్ఐ రమేష్ రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం ప్రభుత్వ మద్యం దుకాణానికి సిబ్బంది తాళం వేసి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం వచ్చి చూడగా దుకాణం తాళం పగలగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా ఒక ఫుల్ బాటిల్, ఒక క్వాటర్ బాటిల్ చోరీకి గురైనట్లు గుర్తించారు. క్యాష్ బ్యాక్స్ ఓపెన్ కాకపోవడంతో నగదు చోరీకి గురికాలేదు. ఇదే విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వగా సీఐ జయచంద్ర, ఎస్ఐ రమేష్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

18 మందిపై బైండోవర్

సంజామల: మండల పరిధిలోని అక్కంపల్లె గ్రామానికి చెందిన 18 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ రెడ్డి సోమవారం తెలిపారు. నాగిరెడ్డి, రామ సుబ్బరెడ్డి ఇరువర్గాలకు చెందిన పలువురిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి ఎదుట హాజరు పరిచామన్నారు. ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

అవుకు: మండల పరిధిలోని సుంకేసుల గ్రామానికి చెందిన బోయ రమాదేవి(30) సోమవారం కల్లాపి రంగు నీళ్లు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు.. చిన్నపుల్లయ్య, రమాదేవి దంపతులు మిరప సాగు చేశారు. దిగుబడులు సరిగా రాక రూ.6 లక్షలు నష్టం వచ్చింది. వాటిని తీర్చే దారి లేక రమాదేవి కల్లాపి రంగు నీళ్లు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతురాలి తల్లి తలారి పుల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్‌రావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోవెలకుంట్ల: స్థానిక ఆర్‌కే పెట్రోల్ బంకు సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సన్నీ పట్టణంలో ఐస్‌క్రీం అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఐస్ ఫ్యాక్టరీ నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా స్వామినగర్ కాలనీకి చెందిన రాజేష్ బైక్‌పై ఎదురుగా వస్తుండగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరు గాయపడటంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

స్టాటర్ చోరీ

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కల్వటాలలో తాగునీటి పథకానికి చెందిన స్టాటర్‌ను సోమవారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ప్రధాన రహదారిలో బోరు ఏర్పాటు చేసి గ్రామస్తులకు తాగునీటి సౌకర్యం అందిస్తున్నారు. స్టాటర్ చోరీకి గురికావడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈవిషయంపై పంచాయితీ సిబ్బంది పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటీవల శివాలయం సమీపంలోని తాగునీటి పథకం స్టాటర్‌ను, ప్రాథమిక పాఠశాల ప్రధాన గేటును సైతం గుర్తుతెలియని దుండగులు అపహరించారు.

పరామర్శ

బనగానపల్లె రూరల్: ప్రమాదవశాత్తూ గాయాలకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్థానిక ఓల్డ్ రైస్ మిల్లు కాలనీకి చెందిన గౌండ హుస్సేన్‌వలిని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ నేత ఓబులరెడ్డి సోమవారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు అత్తార్ అఖిల్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

రాతిదూలం పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ ఏర్వ సంజమ్మ

కోవెలకుంట్ల: మండలంలోని లింగాల గ్రామంలో గణపతి సహిత సోమేశ్వర, లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయాల మండల ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు సోమవారం సర్పంచ్ ఏర్వ సంజమ్మ, మాజీ సర్పంచ్ డీవీ శేషిరెడ్డి ప్రారంభించారు. నాలుగు పండ్ల విభాగంలో ఏర్పాటు చేసిన పోటీలలో 19 జతల వృషభాలు పాల్గొన్నాయి. విజేత వృషభాల యజమానులకు మొదటి బహుమతిగా రూ.40 వేలు, రెండో బహుమతిగా రూ.30 వేలు, మూడో బహుమతుతిగా రూ. 20 వేలు, నాలుగో బహుమతిగా రూ. 10వేలు, ఐదో బహుమతిగా రూ.5 వేలు ప్రదానం చేయనున్నట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో పోటీల నిర్వహణ కమిటీ సభ్యులు ఏర్వ శేషిరెడ్డి, ఏర్వ వెంగళరెడ్డి, బాలకృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, భీమిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, బైరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, బొక్కం ప్రతాప్‌రెడ్డి, చిన్న సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పొదుపు రుణాలు స్వాహా

- అంకిరెడ్డిపల్లెలో ఆలస్యంగా వెలుగులోకి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లెలో పొదుపు గ్రూపు రుణాలు స్వాహా అయిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. టీడీపీ సానుభూతి పరుడు కార్తీక్ భార్య శివమ్మ బుక్‌కీపర్‌గా వ్యవహరిస్తోంది. జననీ గ్రామైక్య సంఘం పరిధిలో 42 పొదుపు గ్రూపులు ఉన్నాయి. రుణాల స్వాహాలో బుక్ కీపర్ భర్త కార్తీక్ పాత్ర ఉన్నట్లు స్పష్టమైంది. పొదుపు గ్రూపు సభ్యులు బ్యాంక్‌లో తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు. ఇందులో కొన్ని గ్రూపులు నేరుగా బ్యాంక్‌లో చెల్లిస్తుండగా మరికొన్ని గ్రూపుల రుణాలను తాము చెల్లిస్తామని కార్తీక్ నమ్మబలికి తీసుకున్నారు. సభ్యులు చెల్లించిన సొమ్మును బ్యాంక్‌లో జమ చేయకుండా వస్తున్నాడు. కొన్ని గ్రూపులకు సంబంధించి రుణం తీరిపోవడంతో మళ్లీ లోన్ తీసుకునేందుకు కార్తీక్ దంపతులను అడిగేవారు. సభ్యులకు పలు కారణాలు చెబుతూ కాలయాపన చేస్తూ వచ్చారు. చివరకు మహిళలు బ్యాంక్ అధికారులను కలవడంతో ఒక గ్రూపు సభ్యులు రూ.4.72 లక్షల బకాయి ఉందని చెప్పడంతో ఖంగుతిన్నారు. ఇదే విషయంపై కార్తీక్ దంపతులను నిలదీయడంతో మార్చి నెలాఖరులోగా చెల్లిస్తామని గడువు కోరుకున్నారు. దంపతులు ఇద్దరూ ఊర్లో లేకపోవడంతో పొదుపు సభ్యులు ఆందోళనతో పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు.